క్లుప్తంగా

మృతుడి కుటుంబానికి సాయం అందజేత



పామర్రు: స్థానిక 17వ వార్డులోని చిన్న మసీదు పక్కన మహమ్మద్ సయ్యద్ అనే వైఎస్సార్ సీపీ కార్యకర్త గుండె పోటుతో మృతి చెందాడు. ఈ నేపథ్యంలో మృతుడి కుటుంబానికి జగనన్న ప్రభుత్వం వైఎస్సార్ బీమా రూ.లక్ష మంజూరు చేసింది. స్థానిక ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ ఆదేశాల మేరకు మృతుడి కుటుంబానికి మట్టి ఖర్చుల నిమిత్తం రూ.10 వేలను తక్షణ సాయం కింద పామర్రు ఏఎంసీ వైస్ చైర్మన్ ఎండీ నయముద్దీన్, ముస్లిం జేఏసీ కన్వీనర్ ఎండీ జమీల్ చేతుల మీదుగా మృతుడి కుటుంబ సభ్యులకు శనివారం అందజేశారు. వైస్ ఎంపీపీ ఆరేపల్లి శ్రీనివాసరావు, మండల కో–ఆప్షన్ సభ్యులు ఎండీ హస్మతుల్లా, ఎంపీటీసీ సభ్యుడు శ్రీనివాస్, ఏఎంసీ మాజీ డైరెక్టర్ హుస్సేన్, కాలిక్, వైఎస్సార్ సీపీ నాయకుడు కొచ్చెర్ల శ్రీనివాసరావు, వెల్ఫేర్ అసిస్టెంట్ హుస్సేన్ పాల్గొన్నారు.

పరిశుభ్రంగా ఉంచండి



గుడివాడ టౌన్: స్థానిక బంటుమిల్లి రోడ్, పాత బైపాస్ రోడ్‌లోని గౌతమ్ బుద్ధ స్థూపం వద్ద పరిసర ప్రాంత ప్రజలు చెత్తచెదారం వేస్తున్నారని, దానిని అరికట్టి పరిశుభ్రంగా ఉంచేలా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ వి మురళీకృష్ణకు లిటిల్ హ్యాండ్స్ ఆర్గనైజేషన్(ఎల్‌హెచ్‌ఓ) సభ్యులు శనివారం వినతిపత్రం సమర్పించారు. స్పందించిన కమిషనర్ మాట్లాడుతూ ఆ పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచేందుకు కృషిచేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎల్‌హెచ్‌ఓ లీగల్ సెల్ రాష్ట్ర కన్వీనర్ హేమంత్‌కుమార్, ఆర్గనైజేషన్ అధ్యక్షురాలు హరిత, ఉపాధ్యక్షుడు కల్యాణ్, బి.కార్తీక్, చరణ్, బాలాజీ, హర్ష, జస్వంత్ తదితరులు పాల్గొన్నారు.

నేడు నూతన భవనాల ప్రారంభం

కాజ(మొవ్వ): మొవ్వ మండలం కాజ గ్రామంలో నిర్మించిన సచివాలయం, రైతు భరోసా కేంద్రాలను ఆదివారం ఉదయం 9.30 గంటలకు ప్రారంభించనున్నట్లు వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు రాజులపాటి రాఘవరావు తెలిపారు. ఈ కార్యక్రమాలకు ముఖ్య అతిథిగా పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ హాజరవుతారని పేర్కొన్నారు. వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాలను విజయవంతం చేయాలని ఆయన కోరారు.

ప్రశాంతంగా నవోదయ ప్రవేశ పరీక్ష

మొవ్వ: మొవ్వ గ్రామంలోని శ్రీ మండవ కనకయ్య జెడ్పీ ఉన్నత పాఠశాలలో జవహర్ నవోదయ విద్యాలయం ఆరో తరగతి ప్రవేశ పరీక్ష శనివారం ప్రశాంత వాతావరణంలో జరిగింది. మొవ్వ మండలంలోని పలు పాఠశాల నుంచి 96 మంది విద్యార్థులు ఈ పరీక్షకు దాఖలు చేసుకోగా 55 మంది హాజరైనట్లు పరీక్ష చీఫ్ సూపరింటెంటెంట్, మొవ్వ జెడ్పీ పాఠశాల హెచ్ఎం ఎస్.సాంబశివరావు తెలిపా రు. సెంటరు పర్యవేక్షకులుగా భట్లపెనుమర్రు హెచ్ఎం సుబ్రమణ్యం వ్యవహరించారు.

గ్రంథ రచయితకు ఘన సన్మానం

నిమ్మకూరు(పామర్రు): నందమూరి తారక రామారావు చరిత్ర అజరామరమని కృష్ణా జిల్లా మాజీ వైస్ చైర్మన్ గొర్రెపాటి వెంకట రామకృష్ణ అన్నారు. ఎన్టీఆర్ స్వగ్రామమైన నిమ్మకూరులో ఇటీవల ఆవిష్కరించిన వెండి తెర వేలుపు–నందమూరి తారక రామారావు అనేగ్రంథం రచయిత రేపల్లె వాసి అయిన మన్నె శ్రీనివాసరావును పామర్రు కళా పరిషత్ సభ్యులు ఆధ్వర్యంలో శనివారం ఘనంగా సన్మానించారు. కళా పరిషత్ అధ్యక్షుడు ఎన్ త్రివిక్రమరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పీ శ్రీను, ఉప సర్పంచ్ నందమూరి జయకృష్ణ ప్రసాద్, కళాపరిషత్ గౌరవాధ్యక్షుడు పీఎంఎస్ ప్రసాద్, భగవద్గీత ప్రచారక్ ఘంటసాల బసవయ్య, ఎన్టీఆర్ కుటుంబ బంధు మిత్రులు చంద్రశేఖర్, కుదరవల్లి నాగేశ్వరరావు, సాహితీ వేత్త మట్టా రాజా, పోలూరు సుబ్బారావు పాల్గొన్నారు.

రేపు శోభాయాత్ర

ముదినేపల్లి రూరల్: అయోధ్యలో శ్రీరాముడి విగ్రహ ప్రాణప్రతిష్ఠ సందర్భంగా సోమవారం సింగరాయపాలెంలో శోభాయాత్ర నిర్వహించనున్నట్లు సింగరాయపాలెం బావాజీ మఠం ఈఓ శింగనపల్లి శ్రీనివాసరావు, మఠంలోని కోదండరామాలయ ప్రధాన అర్చకుడు ఆసూరీ రంగనాథాచార్యులు శనివారం తెలిపారు. ప్రాణప్రతిష్ఠ సందర్భంగా 22వ తేదీ ఉదయం 9గంటలకు శ్రీహరిపురం రామాలయం నుంచి సింగరాయపాలెం బావాజీ మఠం వరకు శోభాయాత్ర నిర్వహించి అనంతరం స్వామి కల్యాణం జరుపుతామన్నారు. అయోధ్యలో జరిగే శ్రీరామవిగ్రహ ప్రాణప్రతిష్ఠను బావాజీ మఠం వద్ద ప్రజలు తిలకించేందుకు వీలుగా ఎల్ఈడీ స్క్రీన్లు ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు.

రైతు సంక్షేమమే ధ్యేయంగా పనిచేయండి

ఎమ్మెల్యే డీఎన్నార్



ఏఎంసీ ప్రథమ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే డీఎన్నార్, ఏఎంసీ చైర్మన్ చేబోయిన వీర్రాజు

కైకలూరు: రైతు సంక్షేమమే ప్రధాన ధ్యేయంగా కైకలూరు వ్యవసాయ మార్కెట్ నూతన కమిటీ కృషి చేయాలని ఎమ్మెల్యే, ఏఎంసీ గౌరవాధ్యక్షుడు దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) అన్నారు. ఏఎంసీ చైర్మన్ చేబోయిన వీర్రాజు అధ్యక్షతన మొదటి సర్వసభ్య సమావేశం ఏఎంసీలో శనివారం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలోనే కైకలూరు ఏఎంసీకి మంచి పేరుందన్నారు. నూతన కమిటీ రైతుల అభివృద్ధి కోసం ప్రణాళికలను రూపొందించి అమలు చేయాలని సూచించారు. ఏఎంసీ చైర్మన్ చేబోయిన వీర్రాజు మాట్లాడుతూ రూ.60 లక్షలతో నూతన ఏఎంసీ కార్యాలయం నిర్మాణం, గ్రామాల్లో ప్రధాన రహదారులను కలుపుతూ లింకు రోడ్లకు అనుమతులు, రూ.5 లక్షల వరకు ఎస్ఎంఆర్ పథకంలో పనులు చేయించే అధికారం, ఏఎంసీకి పంచాయతీ కుళాయి మంజూరు, ఏంఎసీ సమావేశానికి హాజరవుతున్న సభ్యులకు ఒక రోజు వేతనం రూ.250 నుంచి రూ.1,000 వరకు పెంపు వంటి పలు అంశాలను అజెండా రూపంలో ఎమ్మెల్యేకు తెలిపారు. ఏఎంసీ ఉత్తమశ్రేణి కార్యదర్శి సౌజన్య మాట్లాడుతూ ఏఎంసీ పరిధిలో కైకలూరు, ఉప్పుటేరు, పెదఎడ్లగాడి, ముదినేపల్లిలో చెక్‌పోస్టులు ఉన్నాయన్నారు. కైకలూరు మండలంలో 23, మండవల్లి మండలంలో 33, ముదినేపల్లిలో 16 కలిపి 72 రెవెన్యూ గ్రామాలు ఏఎంసీ పరిధిలోకి వస్తాయన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ వైస్ చైర్మన్ ఉచ్చుల చినరాజు, సభ్యులు కన్నా కుమారి, షేక్ మూసా, గిరిటిపల్లి పార్వతీ, బావిశెట్టి స్వామి, నిడుమోలు కుమారి, ముంగర అచ్చమ్మ, కోనాల అనితారాణి, మురళీకృష్ణ, ఉండ్రమట్ల ఏసుకుమార్, యలవర్తి వెంకట పద్మావతి పాల్గొన్నారు.

ఆలయ అర్చకులకు సంక్రాంతి కానుకలు



ప్రాకర్లలో అర్చకుడికి సంక్రాంతి కానుకలను అందజేస్తున్న నాయకులు



నిమ్మకూరులో అర్చకులకు కానుకలను అందజేస్తున్న నాయకులు

పామర్రు: నియోజకవర్గ పరిధిలోని ఐదు మండలాల్లోని పలు ఆలయాల అర్చకులు, పురోహితులకు ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ సంక్రాంతి కానుకలను అందజేశారు. మండల పరిధిలోని నిమ్మకూరులోని శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయ అర్చకులు యోగానంద లక్ష్మీనరసింహాచార్యులకు స్థానిక పార్టీ నాయకులు సంక్రాంతి కానుకలైన నూతన వస్త్రాలను స్వీట్లను శనివారం అందజేశారు. నెమ్మలూరు, ప్రాకర్ల, కొరిమెర్ల, నిభానుపూడి తదితర గ్రామాల్లో ఆలయాల అర్చకులకు కూడా సంక్రాంతి కానుకలను వైఎస్సార్‌సీపీ నాయకులు అందజేశారు.

పమిడిముక్కలలో..

పమిడిముక్కల: ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ ఆధ్వర్యంలో అర్చకులకు స్వీట్లు, నూతన వస్త్రాల పంపిణీ శనివారం జరిగింది. అగినపర్రులోని వేణుగోపాలస్వామి ఆలయం, శివాలయంలోని అర్చకులకు స్వీట్లు, నూతన వస్త్రాలు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ కోట మణిరాజు, పీఏసీఎస్ అధ్యక్షుడు అక్కినేని సతీష్, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు యలమంచిలి గణేష్ పాల్గొన్నారు.



అగినపర్రులో అర్చకులకు స్వీట్లు, నూతన వస్త్రాలు అందజేస్తున్న నాయకులు

వైభవంగా శాంతి కల్యాణం



ముదినేపల్లి రూరల్: ప్రసిద్ధి చెందిన సింగరాయపాలెం–చేవూరుపాలెం సెంటర్లోని సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో శనివారం శాంతి కల్యాణం వైభవంగా జరిగింది. స్వామి జన్మనక్షత్రమైన కృత్తికా నక్షత్రం పురస్కరించుకుని ఈ కల్యాణాన్ని నిర్వహించారు. స్వామి, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను ఆలయ ఆవరణలో వేదికపై ఉంచి అందంగా అలంకరించి ప్రధాన అర్చకుడు తోలేటి వీరభద్రశర్మ ఆధ్వర్యంలో కల్యాణతంతు జరిపారు.

అంగన్‌వాడీ కార్యకర్త విధులకు హాజరు



మండవల్లి: మండలంలోని ప్రత్తిపాడులో అంగన్‌వాడీ కార్యకర్త లక్ష్మి శనివారం విధులకు హాజరైనట్లు సర్పంచ్ బేతపూడి యేసోబురాజు తెలిపారు. అంగన్‌వాడీ సెంటర్‌లో 15 మంది అంగన్‌వాడీ చిన్నారులు ఉన్నట్లు ఆయన పేర్కొన్నారు. సర్పంచ్ మాట్లాడుతూ కార్యకర్త లక్ష్మితో సమ్మె విరమింపజేసి, విధులకు హాజరయ్యేవిధంగా ఆమెకు అవగాహన కల్పించినట్లు పేర్కొన్నారు.

నేడు, రేపు నీటి సరఫరాలో అంతరాయం

గుడివాడ టౌన్: పట్టణంలోని 15వ వార్డు గుడ్‌మెన్ పేట రిజర్వాయర్ ఇంటర్ కనెక్షన్ పనుల కారణంగా పట్టణంలోని 8 నుంచి 18వ వార్డుల పరిధిలో(మొత్తం 11 వార్డులు), 19వ వార్డు పెద్దవీధి, వలివర్తిపాడు రోడ్, బంటుమిల్లి రోడ్, కాకర్లవీధి, నైజాంపేట, గుడ్‌మెన్‌పేట, పంచవటి కాలనీ, బాపూజీనగర్ ప్రాంతాల్లో ఆది, సోమ వారాలు తాగునీటి సరఫరాకు అంతరాయం కలుగుతుందని మున్సిపల్ కమిషనర్ వి.మురళీకృష్ణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని కోరారు.

వికసిత్ భారత్ సంకల్ప యాత్రపై అవగాహన



మండవల్లి: మండలంలోని గన్నవరం, మొఖాసాకలవపూడి గ్రామాల్లోని పంచాయతీ కార్యాలయాల వద్ద వికసిత్ భారత్ సంకల్ప యాత్రపై శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బీజేపీ నాయకుడు శ్రీనివాస్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ పథకాలపై ప్రజలు అవగాహన పెంచుకుని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇన్‌చార్జి ఎంపీడీఓ ఎ.ఆనందబాబు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేయండి



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న మున్సిపల్ అధికారులు, సిబ్బంది

గుడివాడ టౌన్: కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో పేదరిక నిర్మూలన కోసం ప్రవేశపెట్టి అమలు చేస్తున్న అనేక సంక్షేమ కార్యక్రమాలు ప్రజలకు చేరువచేసేలా ఆర్పీలు పనిచేయాలని మున్సిపల్ కమిషనర్ వి.మురళీకృష్ణ కోరారు. స్థానిక 28వ వార్డు సచివాలయ పరిధిలో ఏక్ భారత్–నయా భారత్ పేరిట కేంద్ర ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాల ప్రచారంలో భాగంగా ఈ కార్యక్రమం నిర్వహించినట్లు మున్సిపల్ కమిషనర్ తెలిపారు. అనంతరం కేంద్రప్రభుత్వ సంక్షేమ పథకాల వివరాల క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ శ్రీనివాసులు, టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ నాగేంద్రప్రసాద్, మున్సిపల్ ఉద్యోగులు వట్టెం రామకృష్ణ, గాలీబ్, అశోక్, స్వచ్ఛంద సంస్థ కన్వీనర్ పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహావిష్కరణ విజయవంతం

గుడివాడ టౌన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సంకల్పంతో విజయవాడలో ఏర్పాటు చేసిన సామాజిక న్యాయ మహాశిల్పం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం విజయవంతం కావడం హర్షణీయమని స్థానిక వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్, క్రిస్టియన్ మైనార్టీ సెల్ నాయకులు పేర్కొన్నారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో నాయకులు శనివారం విలేకరులతో మాట్లాడారు. రాజ్యాంగ నిర్మాతకు ఘన నివాళులు అర్పించేందుకు గుడివాడ నియోజకవర్గ పరిధిలోని నందివాడ, గుడ్లవల్లేరు, గుడివాడ, రూరల్ మండలాల నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు తరలిరావడం అభినందనీయం అన్నారు. ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేసిన ప్రతి ఒక్కరికీ వైఎస్సార్ సీపీ తరఫున కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. అంబేడ్కర్ అభిమానులకు కావలసిన వసతులు ఏర్పాటు చేసిన గుడివాడ ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు(నాని)కి కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. సమావేశంలో ఎస్సీ సెల్ అధ్యక్షుడు రేమల్లి నీలాకాంత్, క్రిస్టియన్ మైనార్టీ సెల్ అధ్యక్షుడు ఏలేటి విలియం జోషి, నాయకులు మెండా రవికుమార్, వెంపటి సైమన్, సీహెచ్ జోషి, టి రాజేష్, తుళ్లూరి ప్రశాంత్, గుదే కిరణ్, చిన్నా పాల్గొన్నారు.

గంజాయి పట్టివేత

తోట్లవల్లూరు: తోట్లవల్లూరులోని కృష్ణానది వద్ద 600 గ్రాముల గంజాయిని శనివారం పట్టుకున్నట్లు ఎస్సై పి.విశ్వనాథ్ తెలిపారు. అక్రమంగా గంజాయి కలిగి ఉన్న కొలసాని వెంకటసాయి, యాకోబు, డొక్కు శివశంకర్, కాసిమళ్ల మల్లికార్జునరావు, దార్ల కౌశిక్, లింగాబత్తిన అరుణ్‌కుమార్, గొరిపర్తి చంద్రశేఖర్‌తోపాటు మరో వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్లు పేర్కొన్నారు. అక్రమంగా గంజాయి కలిగి ఉన్న వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పరివర్తనతో జైలు జీవితాన్ని వీడండి



ఖైదీలతో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి లక్ష్మి

కైకలూరు: క్షణికావేశంలో చేసిన తప్పులకు జైలు జీవితం గడుపుతున్న ఖైదీలు పరివర్తన చెంది వారి కుటుంబంతో సుఖంగా జీవించాలని కైకలూరు సీనియర్ సివిల్ కోర్టు జడ్జి, మండల లీగల్ సర్వీస్ కమిటీ చైర్‌పర్సన్ వీవీఎస్‌వీ.లక్ష్మి పేర్కొన్నారు. సాధారణ తనిఖీల్లో భాగంగా కైకలూరు సబ్ జైలును శనివారం సందర్శించారు. ఖైదీల నివాస గదులను సందర్శించి, భోజన వసతి ఎలా ఉందని ప్రశ్నించారు. ఒక్కొక్కరి కేసు వివరాలను తెలుసుకున్నారు. ఆర్థిక స్తోమత లేని ఖైదీలకు ప్రభుత్వమే ఉచితంగా న్యాయవాదిని నియమిస్తుందని పేర్కొన్నారు. ఖైదీలకు జైలులో అందుతున్న సంక్షేమ పథకాలను జైలు సూపరింటెండెంటు బొత్స అప్పారావును అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో బార్ అసోషియేషన్ అధ్యక్షుడు ఎంవీవీ సత్యనారాయణ, ఏఎస్సై మల్లికార్జునరావు, న్యాయవాదులు డి.శివప్రసాద్, శ్యామ్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు

డీఎస్పీ శ్రీకాంత్



ట్రాఫిక్ నిబంధనలపై వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న డీఎస్పీ శ్రీకాంత్

గుడివాడరూరల్: రోడ్డు ప్రమాదాల నివారణకు పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని గుడివాడ డీఎస్పీ పి.శ్రీకాంత్ పేర్కొన్నారు. గుడివాడ ట్రాఫిక్ ఎస్సై ప్రసాద్ ఆధ్వర్యంలో గుడివాడ బస్టాండ్ సెంటర్లో శనివారం సాయంత్రం నిర్వహించిన రోడ్డు భద్రత మాసోత్సవం కార్యక్రమంలో డీఎస్పీ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. పలువురు వాహనదారులకు రోడ్డు భద్రత, నిబంధనలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ జిల్లా ఎస్పీ జాషువా ఆదేశాల మేరకు రోడ్డు ప్రమాదాల నివారణకు ట్రాఫిక్ పోలీసులతో కలసి ప్రత్యేక చర్యలు చేపడుతున్నామన్నారు. ముఖ్యంగా మద్యం తాగి, సెల్ మాట్లాడుతూ వాహనాలు నడపకూడదని సూచించారు. మైనర్లకు వాహనాలు ఇచ్చే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

రామ మందిర ప్రతిష్ఠ మహోత్సవాలను జయప్రదం చేయండి



బ్రోచర్లను ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

గుడివాడ టౌన్: అయోధ్య రామ మందిర విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవ మహాసభలు జయప్రదం చేయాలని గుడివాడ సనాతన ధర్మ నాదోపాసకులు, బృందాల సమాఖ్య సభ నాయకులు కోరారు. శనివారం స్థానిక బంటుమిల్లి రోడ్‌లోని కోదండ రామాలయం ఎదుట మహోత్సవాల బ్రోచర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఈ నెల 22వ తేదీ అయోధ్యలోని శ్రీ రామ మందిర విగ్రహ ప్రతిష్ఠను పురస్కరించుకుని ఉదయం 5.49 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు వైదిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. హైందవ సోదరులు ఈ వైదిక కార్యక్రమాలలో పాల్గొని జయప్రదం చేయాలన్నారు. కార్యక్రమంలో మండలి హనుమంతరావు, బూరగడ్డ శ్రీనాథ్, చందరాల హరిరాంబాబు, చలమలచర్ల మురళీ కృష్ణమాచార్యులు, వి రఘునాథ శాస్త్రి, కఠారి శ్రీవల్లి, జె వీరవెంకటకుమారి, జి నిర్మలాదేవి, మందా దీవెన, బాలబాలాజి, టీఎస్‌వీ సాంబశివరావు, కేవీఎస్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

క్రీడాస్ఫూర్తిని నింపుతున్న ఆడుదాం ఆంధ్రా పోటీలు



క్రీడాకారులను అభినందిస్తున్న పామర్రు ఎంపీపీ దాసరి అశోక్‌కుమార్



పమిడిముక్కలలో షటిల్ పోటీలను ప్రారంభిస్తున్న వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు గణేష్

పామర్రు: ఆడుదాం ఆంధ్రా ఆటల పోటీలు యువకుల్లో క్రీడా స్ఫూర్తిని నింపుతున్నాయని పామర్రు ఎంపీపీ దాసరి అశోక్‌కుమార్ అన్నారు. స్థానిక కంచర్ల రామారావు జెడ్పీ హైస్కూల్లో శనివారం మండల స్థాయిలో ఫైనల్స్‌కి చేరిన క్రీడాకారులను ఆయన అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడల పట్ల యువతలో ఆసక్తి పెంపొందించే విధంగా ఆటలు ఉన్నాయన్నారు. కబడ్డీ, వాలీబాల్, షటిల్ బ్యాడ్మింటన్ తదితర ఆటల్లో యువకులు ఎంతో ఉత్సాహంగా పాల్గొంటున్నారన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం క్రీడలను ఎంతగానో ప్రోత్సహిస్తోందన్నారు. యువకులు అందరూ క్రీడాస్ఫూర్తిని మరింతగా పెంచుకుని జిల్లా జాతీయ స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ఆరేపల్లి శ్రీనివాసరావు, ఎంపీటీసీ సభ్యుడు శ్రీనివాస్, కో–ఆప్షన్ సభ్యులు ఎండీ హస్మతుల్లా, ఈఓపీఆర్డీ డి.జయప్రకాష్ పాల్గొన్నారు.

క్రీడలతో ఉజ్వల భవిష్యత్

పమిడిముక్కల: క్రీడలతో ఉజ్వల భవిష్యత్ లభిస్తుందని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు యలమంచిలి గణేష్ పేర్కొన్నారు. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో మండల స్థాయి ఆడుదాం ఆంధ్రా పోటీలు ఉత్సాహంగా సాగుతున్నాయి. పోటీల్లో భాగంగా శనివారం షటిల్, ఖో–ఖో పోటీలను వైస్ ఎంపీపీ కొడమంచిలి మహేష్‌తో కలిసి ప్రారంభించారు. పోటీలను ఎంపీడీఓ కొండేటి వెంకటేశ్వరరావు, ఏఓ రాజు, పీడీ రవీంద్రబాబు, కార్యదర్శులు ప్రసాద్, విద్యాధర్, స్వామి పర్యవేక్షించారు.

గ్రామాల్లో జోరుగా సాగుతున్న కులగణన



కూచిపూడిలో సర్వే చేస్తున్న సచివాలయ సిబ్బంది



పమిడిముక్కలలో కులగణన ప్రక్రియను పర్యవేక్షిస్తున్న ఎంపీడీఓ వెంకటేశ్వరరావు



గుడివాడలో వివరాల సేకరణను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్



ప్రత్తిపాడులో కులగణన సర్వేలో సర్పంచ్ యేసోబురాజు

మొవ్వ: రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిన కులగణన సర్వే మొవ్వ మండలంలోని 21 గ్రామాల్లో జోరుగా సాగుతోంది. ఈ నెల 28వ తేదీ వరకు కొనసాగే ఈ సర్వేను సచివాలయ సిబ్బంది వలంటీర్ల సహకారంతో నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా కూచిపూడిలో గ్రేడ్–1 కార్యదర్శి ఐ.భవాని పర్యవేక్షణలో వీఆర్వో ఎం ఖాసీం, సచివాలయ సిబ్బంది ఆంజనేయులు, ఉమామహేశ్వరరావు, వినోద్, భార్గవి, నరేంద్ర కూచిపూడి, బార్లపూడి గ్రామాల్లో శనివారం సర్వే నిర్వహించారు. నిడుమోలు, మంత్రిపాలెం, కోసూరు, వేములమడ సచివాలయాల్ల ఈఓ ఎంఎస్ఎస్ మూర్తి, అయ్యంకి, చినముత్తేవి, పెద ముత్తేవి సచివాలయాల్లో ఈఓ నరసింహారావు, పెదపూడి, కాజ, సచివాలయాల్లో ఈఓ ఏడీపీఎల్ ప్రసాద్, మొవ్వ–1, మొవ్వ–2 సచివాలయాల్లో కే సోమేశ్వరరావు, పెడసనగల్లు సచివాలయంలో వి.భార్గవి పర్యవేక్షణలో సర్వే కార్యక్రమాలు వేగవంతంగా సాగుతున్నాయి.

పమిడిముక్కలలో..

పమిడిముక్కల: కులగణన సర్వేను విజయవంతం చేసేందుకు పకడ్బందీగా ఏర్పాట్లు చేసినట్లు ఎంపీడీఓ కొండేటి వెంకటేశ్వరరావు తెలిపారు. సచివాలయ, రెవెన్యూ సిబ్బంది, వలంటీర్లు ఉమ్మడిగా సచివాలయ పరిధిలో ఇంటింటికీ వెళ్లి కులాల వారీగా ప్రతి ఒక్కరి వివరాలు సేకరిస్తున్నట్లు పేర్కొన్నారు. పమిడిముక్కలలో కులగణన ప్రక్రియను శనివారం ఎంపీడీఓ పర్యవేక్షించారు.

కులగణనకు సహకరించండి

గుడివాడ టౌన్: ప్రభుత్వ ఆదేశాల మేరకు పట్టణంలో నిర్వహిస్తున్న సామాజిక, ఆర్థిక కులగణన కార్యక్రమానికి ప్రజలు సహకరించాలని మున్సిపల్ కమిషనర్ వి.మురళీకృష్ణ కోరారు. స్థానిక పెద్దవీధి, సంఘంబడి తదితర ప్రాంతాలలో కులగణన సేకరణ పనులను ఆయన శనివారం పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 19వ తేదీ నుంచి 28వ తేదీ వరకు కులగణన పూర్తి చేయాలని ప్రభుత్వం ఆదేశించిందన్నారు. ఈ సేకరణ కార్యక్రమాన్ని ఉదయం 5 గంటల నుంచి 10 గంటల వరకు, సాయంత్రం 5 గంటల నుండి తొమ్మి గంటల వరకు సేకరిస్తామన్నారు. ఆదివారం కూడా ఈ ప్రక్రియ కొనసాగుతుందని కలెక్టర్ ఆదేశించారన్నారు. ప్రజలు తమ ఇంటికి వచ్చిన ఉద్యోగులకు సహకరించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఏరియా ఇన్‌చార్జి గాలిబ్ పాల్గొన్నారు.

ప్రత్తిపాడులో..

మండవల్లి: మండలంలో ప్రత్తిపాడులో శనివారం కులగణన సర్వే ప్రారంభమైంది. సర్పంచ్ బేతపూడి యేసోబురాజు మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పాటు చేసిన కులగణన సర్వే ప్రజలకు ఎంతో మేలు చేస్తుందన్నారు.

వృద్ధులకు పింఛన్ల పంపిణీ



వృద్ధులకు పింఛన్ అందజేస్తున్న దాతలు గోపాల్‌రెడ్డి, పద్మజ దంపతులు

పామర్రు: పామర్రు మండల రెడ్డి వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యుల ఆధ్వర్యంలో శనివారం స్థానిక పుట్లమ్మతల్లి ఆలయంలో వృద్ధులకు పింఛన్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు బొమ్మారెడ్డి రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ దాతలు బొమ్మారెడ్డి గోపాలరెడ్డి, పద్మాజారెడ్డి మనుమరాళ్ల పర్ణికారెడ్డి, సాన్వికారెడ్డి పింఛన్ల పంపిణీకి సింహభాగం సహకరిస్తున్నారని తెలిపారు. మిగిలిన సహకారాన్ని 10 మంది దాతలు అందిస్తున్నారని పేర్కొన్నారు. ఈ నగదుని డిపాజిట్ చేసి వచ్చిన వడ్డీని మండల పరిధిలో ఎంపిక చేసిన 24 మంది పేదలైన వృద్ధులకు ఒకొక్కరికి ప్రతి నెలా రూ.1,000 చొప్పున పింఛను అందిస్తున్నామన్నారు. ఏడాది పాటు ఈ పెన్షన్‌ను వారి ఇళ్లకు వెళ్లి అందజేయనున్నట్లు తెలపారు. అసోసియేషన్ అభివృద్ధికి దాతలు మరింతగా సహకరించాలని కోరారు. కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి బొంతు సుధాకర్‌రెడ్డి, పీఏసీఎస్ అధ్యక్షుడు బొమ్మారెడ్డి నారాయణరెడ్డి, సభ్యులు గుంటక ఆంజనేయరెడ్డి, ఆరుమళ్ల శ్రీనాథ్‌రెడ్డి, వెంట్రామిరెడ్డి, బొమ్మారెడ్డి రామకృష్ణారెడ్డి, కోటిరెడ్డి పాల్గొన్నారు.

చికిత్స పొందుతున్న వృద్ధురాలి మృతి

తోట్లవల్లూరు: పాము కాటుకు గురైన వృద్ధురాలు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన మండలంలోని రొయ్యూరులో శనివారం జరిగింది. గ్రామానికి చెందిన మోర్ల పద్మ(70) ఇంటి వద్ద పుల్లలు సర్దుకుంటుంగా శుక్రవారం పాము కాటుకు గురైంది. బంధువులు వెంటనే ఆమెను చికిత్స కోసం కంకిపాడు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందింది. మృతురాలి మేనల్లుడు కృష్ణ ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పి. విశ్వనాథ్ తెలిపారు.